క్లుప్తంగా

108 అంబులెన్స్‌లో ప్రసవం



కారెంపూడి: 108 అంబులెన్స్‌లో ప్రసవం జరిగి తల్లీబిడ్డ క్షేమంగా ఉన్న ఘటన గుత్తికొండ సమీపంలో మంగళవారం రాత్రి 10.30 గంటలకు జరిగింది. కారెంపూడి శివారు ఆదినారాయణ కాలనీకి చెందిన హైమావతి అనే గర్భిణిని పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో 108 వాహనంలో నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మార్గ మధ్యలో అంబులెన్స్‌లోనే ఆమె ప్రసవించింది. ఈఎంటీ బత్తుల సురేష్, పైలెట్ భిక్షమయ్య వైద్య సేవలు అందించారు. హైమావతికి ఇది మూడో కాన్పు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

పెట్రోల్ బంకు నిర్మాణ పనులు నిలుపుదల

కారెంపూడి: మండలంలోని కాచవరం గ్రామంలో సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం చేపట్టిన పెట్రోలు బంకు నిర్మాణ పనులు ఆపాలని తహసీల్దార్ జె.శ్రీనివాస్ మంగళవారం సాయంత్రం ఆదేశాలిచ్చారు. స్థలంలో కొంత ప్రభుత్వ భూమి ఉందని సర్వేయర్ సులేమాన్‌ఖాన్, వీఆర్వో పలుపులేటి సైదులు ప్రాథమికంగా నివేదించడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. సర్వే నంబరు 870లో జరుగుతున్న పెట్రోలు బంకు నిర్మాణ స్థలంలో.. కొంత ప్రభుత్వ భూమి ఉందనే అనుమానం, సరైన అనుమతులు కూడా లేవనే కారణంగా విషయం తేలేవరకు నిర్మాణ పనులు ఆపాల్సిందిగా ఆదేశాలిచ్చామని తహసీల్దార్ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ

గురజాల: ఇరువర్గాలు ఘర్షణ పడి పలువురికి గాయాలైన ఘటన బుధవారం జరిగింది. వివరాల మేరకు.. నగర పంచాయతీలోని జంగమేశ్వరపురానికి చెందిన ఒక వర్గానికి చెందిన యువకులు మంగళవారం రాత్రి సందర్భం లేకుండా కేక్ కటింగ్ చేపట్టి, మరొక వర్గాన్ని అసభ్య పదజాలంతో దూషించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రాత్రి ఎందుకు తిట్టారు అని మరుసటి రోజు ఇరువర్గాల మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఒక వర్గానికి చెందిన ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ అశోక్‌బాబు పరిశీలించారు.

106కేసులు.. రూ.5.41లక్షల ఫైన్

గురజాల: గురజాల సెక్షన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్‌శాఖ విజిలెన్సు, ఆపరేషన్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు బి.విజయకృష్ణ, జె.హరిబాబులు తెలిపారు. 106 మందిపై కేసు నమోదు చేసి, రూ.5.41 లక్షల అపరాధ రుసుం విధించినట్లు వెల్లడించారు. ఎవరైనా అక్రమంగా విద్యుత్ వాడుతున్నట్లు తెలిస్తే.. 94408 12263, 94408 12360 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. 150 మంది సిబ్బంది 50 బృందాలుగా దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో డీఈఈ ఎం.రవికుమార్, కె.రవికుమార్, ఎం.శ్రీనివాసరావు, ఏఈలు కె.కోటేశ్వరరావు, షేక్ మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.

పాత సామగ్రిని గుర్తించాలి

దాచేపల్లి: ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న పాత సామగ్రిని గుర్తించాలని మండల ప్రత్యేక అధికారి వై.మహాలక్ష్మి సూచించారు. మిషన్ శోభకృత్-2023 కార్యక్రమంపై మండల స్థాయి అధికారులతో మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల ప్రభుత్వ కార్యాలయాల్లో పాతసామగ్రిని ఈ నెల 20వ తేదీలోపు మండల పరిషత్ కార్యాలయం వద్దకు తరలించాలని చెప్పారు. వీటిని వేలం ద్వారా విక్రయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ కటకం జయశ్రీ, జడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఈవోపీఆర్డీ మాధవీలత పాల్గొన్నారు.

ఘనంగా రామయోగి తాత ఆరాధనోత్సవం

దుర్గి: దుర్గి గ్రామ శివారులో వేంచేసియున్న శ్రీశ్రీ గుత్తికొండ బిలం రామయోగి తాత 61వ ఆరాధన మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు హోమం, కై ంకర్యాలు సమర్పించారు. మధ్యాహ్నం మహా అన్నదానం జరిగింది. ధర్మకర్త పోలేపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. గుత్తికొండ భజన బృందం నిర్విరామంగా భజనలు చేపట్టారు. ఆశ్రమ నిర్వాహకులు గోపిశెట్టి నరసింహారావు, గుల్లపల్లి ఆశ్రమ నిర్వాహకులు అనంతరామయ్య, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

20 ఏళ్ల భవిష్యత్తు మనమే నిర్ణయించుకుందాం..

- మన భవిష్యత్తు సీఎం జగనే అని ఇంటింటికీ చెబుదాం..
- ప్రతి సంక్షేమ లబ్ధిని, అభివృద్ధిని వివరిద్దాం..
- గృహసారథులు, కన్వీనర్లతో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం
- దిశా నిర్దేశం చేసిన ప్రభుత్వం విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి



'మా నమ్మకం నువ్వే జగన్' బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పీఆర్కే, పీవీఆర్

మాచర్ల రూరల్: పేదలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు అందిస్తూ అనతి కాలంలో కీర్తి ప్రతిష్టలు సాధించారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులకు 'మా నమ్మకం నువ్వే జగన్' శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఆర్కే ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. రాష్ట్రంలో కోట్లాది మంది ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ అభివృద్ధిలో దూసుకుపోతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనను ప్రతి ఇంటి తలుపు తట్టి సగర్వంగా తెలియజేయాలని పీఆర్కే పిలుపునిచ్చారు. రానున్న 20 ఏళ్ల భవిష్యత్తు సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. ప్రతి సంక్షేమ పథకాన్ని ఇంటింటికీ తీసుకుపోయి.. మన భవిష్యత్తును మనమే నిర్ణయించుకుందామని పీఆర్కే దిశానిర్దేశం చేశారు.

నియోజకవర్గంలో రూ.2,500కోట్ల అభివృద్ధి...

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తూ మాచర్ల నియోజకవర్గంలో 61 వేల మంది పేదల ఖాతాల్లో వందల కోట్ల రూపాయలు నేరుగా జమ చేసినట్లు తెలిపారు. రూ.2,500 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి జరుగుతోందని వెల్లడించారు. నాగార్జున సాగర్ నుంచి దావుపల్లి వరకు రూ.349కోట్లు, మాచర్ల నుంచి దాచేపల్లి వరకు రూ.403కోట్లతో రహదారులు నిర్మిస్తున్నట్లు ఆయన చెప్పారు. దీంతో రవాణా సౌకర్యంతో పాటు..స్థానికంగా భూముల విలువలు కూడా విపరీతంగా పెరుగుతాయని చెప్పారు. మాచర్ల పట్టణానికి శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం కృష్ణానది జలాలు బుగ్గవాగు నుంచి అందించేందుకు రూ.80.52కోట్లు, రూ. 26 కోట్లతో 4 వేల ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పల్నాటి ప్రజల చిరకాల వాంఛ వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1,650 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. తద్వారా 80వేల ఎకరాలకు సాగునీరందించేందుకు ఉన్న అభ్యంతరాలను తొలగించి, రాష్ట్ర ప్రభుత్వం 55 ఎకరాల రెవెన్యూ భూమిని అటవీశాఖ అధికారులకు అందించినట్లు తెలిపారు. వీటితో పాటు.. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ ఆరోగ్య క్లీనిక్‌లు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గత టీడీపీ ప్రభుత్వంలో రూ.1.60లక్షల కోట్ల అప్పులు చేసి, ఏ ఒక్క పథకాన్ని కూడా పేద ప్రజలకు అందించకుండా.. బినామీలకు కట్టబెట్టి మలేషియా, సింగపూర్‌లకు నగదు తరలించిన నీచమైన చరిత్ర చంద్రబాబునాయుడిదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మరుమాముల శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, జడ్పీటీసీ మల్లుస్వామి, వైస్ ఎంపీపీ పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, సొసైటీ చైర్మన్ జి.సత్యనారాయణరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ శేరెడ్డి వీరారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ గృహ సారథులు పాల్గొన్నారు.



హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు..

భక్తులకు మెరుగైన సేవలందించాలి



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పీఆర్కే, చైర్మన్ బద్దూరి

రెంటచింతల: మహా శివరాత్రిని పురస్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రం శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో దర్శనానికి వచ్చే భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన సేవలను అందించేందుకు వివిధ శాఖల అధికారులందరూ సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సూచించారు. బుధవారం మహా శివరాత్రి ఉత్సవాల వాల్ పోస్టర్లను ఆయన దేవస్థానం చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, పార్టీనేతలతో కలిసి ఆవిష్కరించారు. మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన నాయకులు మోర్తల ఉమ, యూత్ విభాగం మండల అధ్యక్షుడు గొట్టం చిన బ్రహ్మారెడ్డి, మాచర్ల మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, ఎంపీటీసీ పి.సంపూర్ణమ్మ, పార్టీ నేతలు పోట్ల శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో అకాల మృతి



పిడుగురాళ్ల: ఆర్టీసీ బస్సులో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. వివరాల మేరకు.. పిడుగురాళ్ల ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు దాచేపల్లి నుంచి పిడుగురాళ్ల వైపు వెళ్తోంది. దాచేపల్లికి చెందిన షేక్ దరియా(56) పిడుగురాళ్లకు టిక్కెట్ తీసుకున్నాడు. ప్రయాణంలో ఫిట్స్ లాగా రావటంతో ప్రయాణికులు దరియా చేతులో తాళాలు పెట్టి ప్రథమ చికిత్స అందించారు. పిడుగురాళ్ల సమీపంలోకి వచ్చే సరికి అతను మృతి చెందాడు. కండక్టర్ డిపో మేనేజర్‌కు సమాచారం అందించారు. మృతుని జేబులో కుటుంబ సభ్యుల ఫోన్ నంబరు ఉండటంతో సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని తీసుకొని వెళ్లారు. మృతుడు పిడుగురాళ్ల పట్టణంలో బీరువాలకు పెయింటర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. ఈ సంఘటనపై కేసు నమోదు కాలేదని పట్టణ సీఐ ఎం.మధుసూదన్‌రావు తెలిపారు.

వధువులకు చేయూత

పిడుగురాళ్ల: చింతలపూడి చారిట్రబుల్ ట్రస్టు, పల్నాడు హాస్పిటల్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన గంధం మేరి అమూల్య అనే వధువుకు బుధవారం బంగారు ఉంగరం, నూతన వస్త్రాలను చింతలపూడి బ్రదర్స్ చింతలపూడి అశోక్‌కుమార్, చింతలపూడి బాబు యమున దంపతులు నూతన వధువుకు బంగారు ఉంగరం, వస్త్రాలను అందజేశారు. మండలంలోని జానపాడు గ్రామానికి చెందిన మక్కెన త్రివేణి వివాహానికి కూడా హాజరై ఇక్కడ కూడా ఉంగరం, వస్త్రాలను అందించి, ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రింటింగ్ ప్రెస్ షాపు దగ్ధం

పిడుగురాళ్ల: విద్యుత్ షార్ట్యూట్‌తో పట్టణంలోని వేణి ప్రింటింగ్ ప్రెస్ షాపు బుధవారం తెల్లవారుజామున దగ్ధమైంది. యజమాని పెద్దింటి చక్రవర్తి ఉదయం వచ్చి చూసేసరికి షాపులో మంటలు గమనించాడు. తలుపు తీసి మంటలను ఆర్పే ప్రయత్నం చేశాడు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల విలువ చేసే సామగ్రి కాలిపోయిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

పల్నాటి ముద్దుబిడ్డ.. ప్రజల మనిషి

- ఘనంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు
- భారీగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, అధికారులు
- ప్రత్యేక పూజలు, ప్రజలతో పీఆర్కే, పీవీఆర్ మమేకం...



మండల పరిషత్ కార్యాలయంలో పీఆర్కేని గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

మాచర్ల: వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు నియోజకవర్గంలో వాడవాడలా ఘనంగా జరిగాయి. పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాత మాచర్లలోని శ్రీ గంగాపార్వతి సమేత నగరేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. కేక్ కట్ చేసి, పలువురి అభినందనలు పొందారు. అనంతరం శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. దేవాలయ ఈఓ సాంబయ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికి, సత్కరించారు. అక్కడి నుంచి శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాలు చేయించి, సత్కరించారు. పాత మాచర్లలోని వెంకటేశ్వరస్వామి, బస్టాండ్ సెంటర్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో ఈఓ గిరిరాజు నర్సింగబాబు ఆధ్వర్యంలో ఆయనకు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. శ్రీశైలం రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిపిన పీఆర్కేకు గౌడ సంఘం నాయకులు స్వాగతం పలికి, సన్మానించారు.

అన్నదానం..

మాచర్ల పట్టణంలో కౌన్సిలర్ రామిశెట్టి వెంకటేశ్వర్లు, పార్టీ నేతల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పీఆర్కే హాజరయ్యారు. కేక్ కట్ చేసి అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కౌన్సిలర్లు గట్ల కోటిరెడ్డి, రామాంజిరెడ్డి, వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎంపీపీ చింతా ఆధ్వర్యంలో..

వెల్దుర్తి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చింతా శివరామయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీపీ ఆధ్వర్యంలో నేతలు కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పులుసు నారాయణరెడ్డి, చింతా ఆదినారాయణ, తోట ఆంజనేయులు, కేసిరెడ్డి నాగిరెడ్డి, ఎంపీడీఓ ప్రసాద్, ఈఓపీఆర్డీ జవహర్‌లాల్ నెహ్రూ, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ ఆధ్వర్యంలో..

మాచర్ల రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన జన్మదిన వేడుకల్లో ప్రభుత్వ విప్ పీఆర్కే పాల్గొన్నారు. అధికారులు, నేతలతో మాట్లాడారు. అనంతరం 53 కేజీల భారీ కేక్ కట్ చేసి, అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, జడ్పీటీసీ మల్లుస్వామి, వైస్ ఎంపీపీ పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, సొసైటీ చైర్మన్ జి.సత్యనారాయణ రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ శేరెడ్డి వీరారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం..

దుర్గి: ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం ఆత్మకూరు జంక్షన్ వద్ద ఉన్న వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ముందుగా బర్త్‌డే కేక్ చేసి, పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ ఊరుబండి యోగయ్య, నాయకులు ఊరుబండి మన్నయ్య ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి, అడిగొప్పల సర్పంచ్ నాలి రామయ్య, జంగా యలమంద, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గజమాలతో పీఆర్కేకి నేతల సన్మానం



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ శివరామయ్య తదితరులు



కంచరగుంట నేతల ఆధ్వర్యంలో...

అనిగ్రేస్ వృద్ధాశ్రమంలో..

గురజాల: మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు స్థానిక అనిగ్రేస్ వృద్ధాశ్రమంలో ఏపీ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ కర్రా ప్రగతి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి, వృద్ధులకు అందించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), ఏపీపీ బండి వీరభద్రుడు, న్యాయవాది చల్లా రామిరెడ్డి, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు షేక్ బడేజానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య , లీగల్ సెల్ అధ్యక్షుడు కత్తి చలమరాజు, కర్రా గిరిబాబు, కందిమళ్ల శ్రీనివాసరావు, గాడిపర్తి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.



గంగాపార్వతీ సమేత నగరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



మున్సిపల్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పీఆర్కే, పీవీఆర్



భారీ పూలమాలతో పీఆర్కేకు సన్మానం

ఘనంగా పీఆర్కే జన్మదిన వేడుకలు



రెంటచింతలలో కేక్ కట్‌చేస్తున్న ఎంపీపీ చౌడేశ్వరి, వైఎస్సార్ సీపీ నేతలు

రెంటచింతల: ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు స్థానిక వైఎస్సార్ రాజశేఖరరెడ్డి కాంశ్య విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, పార్టీ మండలాధ్యక్ష, ఉపాధ్యక్షులు పూజల రామయ్య, ఏరువ శౌరెడ్డి, రాష్ట్ర యువజన కార్యవర్గ సభ్యుడు మోర్తల ఉమ కేకు కట్‌చేసి పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు పంపిణీ చేశారు. సర్పంచ్ పూజల పుష్పావతి రామయ్య, సర్పంచ్ గొలమారి నాగలక్ష్మి శ్రీనివాసరెడ్డి, నేతలు తుమ్మా ఇన్నారెడ్డి, పమ్మి సీతారామిరెడ్డి, గొట్టం భాస్కర్‌రెడ్డి, యేలూరి సత్యం, నారపరెడ్డి, బి.తిరుపతిరావు, డేగల సంసోన్ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న పిన్నెల్లి..



కారెంపూడి: ఆదినారాయణ కాలనీలో పీఆర్కే జన్మదిన వేడుకలు

ప్రజానాయకుడు పీఆర్కే..

కారెంపూడి: నిజమైన పల్నాటి ప్రజానాయకుడు, అభివృద్ధి ప్రదాత ప్రజల వెన్నంటి నిలిచే.. మంచి మనిషి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అని పల్నాడు జిల్లా పార్టీ కార్యదర్శి కొమ్ము చంద్రశేఖర్ అన్నారు. ఆదినారాయణ కాలనీలో బుధవారం ఎమ్మెల్యే పీఆర్కే జన్మదినోత్సవాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఎంపీటీసీ వేముల పద్మలింగయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పీఆర్కేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జడ్పీటీసీ షేక్ షఫీ, సర్పంచ్ రమావతు ప్రమీలాభాయి తేజానాయక్, పట్టణ పార్టీ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య, ఎంపీటీసీ షేక్ ఆరీఫ్, చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, పాతూరి రామిరెడ్డి, మర్రి శేషయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సాయంత్రం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో పట్టణ పార్టీ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య ఆధ్వర్యంలో పీఆర్కే జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఎంపీపీ మేకల శారదా శ్రీనివాస రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు కొంగర సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీపీ పంగులూరి చినవెంకట నర్సయ్య, షేక్ అక్బర్, పంగులూరి రామకృష్ణయ్య, మందాళ్ల అంజిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి నల్లగురవారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ అల్లు వెంకటేశ్వరరెడ్డి, వున్నం ఆదిశేషగిరిరావు, కొమెర పిచ్చెయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, మండల అధికారులు, వందలాదిగా అభిమానులు, కార్యకర్తలు భారీ పూలమాలలతో మాచర్ల తరలి వెళ్లి పీఆర్కేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వాడవాడలా..

కారెంపూడి: కారెంపూడిలో వంగవీటి మోహనరంగా విగ్రహం వద్ద, నాయుళ్ల బజారులో, బావి సెంటర్‌లో ప్రభుత్వ విప్ పీఆర్కే జన్మదిన వేడుకలు జరిగాయి. బాణ సంచా కాల్చి యువత సంబరాలు చేసుకున్నారు. పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మిన అల్లయ్య, కొంగర సుబ్రహ్మణ్యం, పలిశెట్టి కోటేశ్వరరావు, డి.వెంకటేష్(డీవీ), మాజీ ఉప సర్పంచ్ బొమ్మిన వీర బ్రహ్మం కేక్‌లు కట్ చేసి, పీఆర్కేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

కంచరగుంట యూత్ ఆధ్వర్యంలో..

దుర్గి: మండలంలోని దుర్గి, అడిగొప్పల, ఆత్మకూరు, పోలేపల్లి, ముటుకూరు, కంచరగుంట, ఓబులేశుని పల్లె, రాజానగరం, తేరాల, ధర్మవరం గ్రామాల్లో ఎమ్మెల్యే పీఆర్కే జన్మదిన వేడుకలు జరిగాయి. ఆత్మకూరులోని వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. కంచరగుంట యూత్ నాయకుడు మాదాసు వాసు ఆధ్వర్యంలో 30కిలోల కేకును ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో పీఆర్కే చేతుల మీదుగా కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసి బొంత కృష్ణ, వైస్ ఎంపీపీ ఊరుబండి యోగయ్య, పార్టీ నాయకులు మన్నయ్య ఆధ్వర్యంలో తనపై నల్లగొండ గద్దర గానం చేసిన ప్రత్యేక పాటను పీఆర్కే ఆవిష్కరించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ)
97053 46588 (మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com